# ఉనికి

ఒకరోజు శంకుడు పొరుగూరుకు వెళ్ళవలసి వచ్చింది. గుర్రం ఎక్కి ఉదయాన్నే బయలుదేరిపోసాగాడు.

మార్గం మధ్యలో ఓ చిట్టడవి ఉంది. చిట్టడవిలో ప్రయాణిస్తూ వుండగా ఓ చెట్టు కింద ఓ స్వామి తపస్సు చేస్తూ ఉండడం అతనికి కనిపించింది.

శంకుడు ఆధునిక భావాలు కలవాడు. దేవుడిని నమ్మడు. సాధువు దగ్గరికి గుర్రం తీసుకెళ్ళి గుర్రాన్ని సకిలింపచేశాడు.

తపో భంగమైన స్వామి కళ్ళు తెరిచాడు – "ఎవరు నాయనా నువ్వు? ఎందుకు నాకు తపోభంగం కలిగించావు?" ప్రశాంతంగా అడిగాడు స్వామి.

"నేను శంకుడు అనే శాస్త్రవేత్తను. ఎందుకిలా మార్గమధ్యలో కూర్చుని కొంగ జపం చేస్తున్నావు?" ధిక్కార స్వరంతో అడిగాడు.

"శంకూ! భగవంతుడి గురించి తపస్సు చేస్తున్నాను."

శంకుడు పెద్దగా నవ్వాడు – "లేని దేవుడిని గురించి తపస్సు చేసే బదులు – మానవ సేవ చెయ్యొచ్చు కదా!" ఎగతాళిగా అన్నాడు.

"దేవుడు లేడని నీకెలా తెలుసు?"

"ఉంటే కనిపించేవాడు గదా!"

"కనిపిస్తేనే ఉన్నట్లా?"

"అవును. తన ఉనికి నిరూపించుకోవాలి ఏ వస్తువైనా?"

"నాయనా శంకూ! నువ్వు గాలిని చూశావా?"

"మూర్ఖుడా! గాలి ఎక్కడైనా కనిపిస్తుందా? గాలిని పీలుస్తాం" ఆవేశంగా అన్నాడు.

"నాకు గాలి కనపడడం లేదు కాబట్టి నేను గాలి లేదు అనుకోమంటావా?" స్వామి నవ్వుతూ అన్నాడు.

"గాలి లేకపోతే చస్తావు! నిరూపించాలంటే కాసేపు నోరు, ముక్కు మూసుకో!" శంకుడు హేళనగా అన్నాడు.

"అజ్ఞానీ, దేవుడు లేడనవద్దు. ఆయన్ని కనుక్కునే మార్గాన్ని అన్వేషించు. ఆత్మశుద్ధి లేంది దేవుడిని గ్రహించలేవు. గాలిని అనుభవిస్తున్నట్లే దేవుడిని అనుభవంతో కనుక్కో నాయనా! ఈ ప్రపంచంలో నీకు కనిపించనివన్నీ లేవనుకోవద్దు. నీకు కనిపించేవి అన్నీ వుంటాయి అనుకోవద్దు. చూసే దృష్టిని బట్టి వస్తువు ఉనికి మారుతుంది."

శంకుడు తన తప్పు గ్రహించాడు.